ఈనాడు
తూర్పుగోదావరి
శనివారం 26 మే 2018
16 పేజీలు

## లింకన్ యూనివర్సిటీ కాలేజీతో కేఆర్‌యూ, జేఎన్టీయూ ఒప్పందం



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసిన అనంతరం కరచాలనం చేసుకుంటున్న కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్ డా.పులిపాటి కింగ్, లింకన్ వర్సిటీ వీసీ డా.అమియాభౌమిక్

-2లో

# లింకన్ యూనివర్సిటీ కాలేజీతో కేఆర్‌యూ, జేఎన్టీయూ ఒప్పందం

కృష్ణావిశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: విద్యా విధానంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టేందుకే మలేషియాలోని లింకన్ యూనివర్శిటీ కాలేజీతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణా, జేఎన్‌టీయూ(కాకినాడ) విశ్వవిద్యాలయాలు మలేషియాలోని లింకన్ యూనివర్శిటీ కాలేజి వారితో శుక్రవారం ఎంవోయూ(మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్)ను కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని వీసీ ఛాంబర్‌లో శుక్రవారం మంత్రి, ఎంపీ కొనకళ్ల నారాయణరావు సమక్షంలో కుదుర్చుకున్నాయి. కృష్ణా, జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయాల ఉపకులపతి ఆచార్య సుంకరి రామకృష్ణారావు అధ్యక్షతన 12 విద్యావిషయక అంశాల్లో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం తరఫున వీసీ రామకృష్ణారావు, రిజిస్ట్రార్ ఆచార్య డా.పులిపాటి కింగ్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. జేఎన్‌టీయూ తరఫున ఆ విశ్వవిద్యాలయానికి ఇన్‌ఛార్జి ఉపకులపతిగా కొనసాగుతున్న కృష్ణా వీసీ రామకృష్ణారావు, రిజిస్ట్రార్ ఆచార్య డా.వి.వి.సుబ్బారావులు, లింకన్ విశ్వవిద్యాలయం తరఫున ఉపకులపతి, సీఈవో డా.అమియా భౌమిక్ ఒప్పంద పత్రంలో సంతకం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి రవీంద్ర మాట్లాడుతూ జేఎన్‌టీయూ, కృష్ణా విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు, అధ్యాపకులు మలేషియాలో ఉన్న బోధనా పద్ధతులు, విద్యార్థుల మనస్తత్వాలు, ప్రతిభను గురించి తెలుసుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయానికి రూ.72కోట్లతో బందరు మండల పరిధిలోని రుద్రవరం గ్రామంలో నూతన భవనాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. వాటిని త్వరితగతిన పూర్తిచేసి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదగా ప్రారంభోత్సవం చేయిస్తామన్నారు. బందరు పార్లమెంటు సభ్యుడు కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ గతంలో బందరు పట్టణం విద్యాకేంద్రంగా విలసిల్లిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.. కృష్ణావిశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డా.సుంకరి రామకృష్ణారావు మాట్లాడుతూ మలేషియా లింకన్ విశ్వవిద్యాలయానికి 19 దేశాల్లో బ్రాంచిలున్నాయని దీని వల్ల కృష్ణా విశ్వవిద్యాలయ విద్యార్థులు రీసెర్చ్ ప్రాజెక్టుల కోసం ఆయా దేశాలకు వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

### సంస్కృతులపై అవగాహన : లింకన్ విశ్వవిద్యాలయ ఉపకులపతి

భారత్, మలేషియా దేశాలు విద్యాసంబంధమైన ఈ చారిత్రక ఒప్పందం చేసుకోవడం వల్ల రెండు విభిన్న సంస్కృతుల గురించి రెండు దేశాల విద్యార్థులు తెలుసుకునే అవకాశం దక్కుతుందని లింకన్ యూనివర్శిటీ ఆఫ్ కాలేజ్ సీఈవో, ఉపకులపతి ఆచార్య డా.అమియాభౌమిక్ అన్నారు. లింకన్ విశ్వవిద్యాలయంలో సుమారు 100 ప్రోగ్రామ్‌లు విద్యార్థుల కోసం రూపొందించినట్లు చెప్పారు. కెమికల్ ఇంజినీరింగ్, మెరైన్ ఇంజినీరింగ్, సోషల్‌స్టడీస్, నర్సింగ్, సోషియాలజీ, వంటి ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు లభించిన సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం అతిథులందరినీ కృష్ణా వీసీ రామకృష్ణారావు సత్కరించారు.